క్లుప్తంగా

తెలుగు భాషా తేజం చెళ్లపిళ్ల

కడియం: తన రచన ద్వారా తెలుగు భాషా తేజంలా మహాకవి చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి పేరొందారని చెళ్లపిళ్ల కళా సేవా సమితి అధ్యక్షుడు అడపా సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి చిలుకూరి శ్రీనివాసరావు అన్నారు. తిరుపతి వెంకట కవుల్లో ఒకరైన చెళ్లపిళ్ల వర్ధంతిని శనివారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద నిర్వహించారు. ఉప సర్పంచ్ వెలుగుబంటి రఘురామ్, తోరాటి వసంతరావులు జంట కవుల విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు. సమితి సభ్యులు చిక్కాల ఈశ్వరరావు, బోణం సత్యనారాయణ, తమ్మిశెట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డిని కలసిన నర్సరీ అసోసియేషన్ సభ్యులు


మంత్రి కిషన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

కడియం: కేంద్ర పర్యాటక శాఖా మంత్రి జి.కిషన్‌రెడ్డిని ఢిల్లీలోని ఆయన అధికారిక నివాసంలో సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పుల్లా సత్యనారాయణ (చంటియ్య) ఆధ్వర్యంలో సభ్యులు శనివారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఎకో టూరిజం ప్రాజెక్టు కార్యరూపం దాల్చే విధంగా కృషి చేయాలని ఆయనకు విన్నవించినట్లు చంటియ్య తెలిపారు. తాను స్వయంగా నర్సరీలను చూసేందుకు వస్తానని మంత్రి కిషన్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు.

వైభవంగా రుద్రాభిషేకం


అఖండ నామ సంకీర్తన చేస్తున్న శ్రీసత్యసాయి సేవా సమాజం సభ్యులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఆల్కాట్‌తోటలోని శ్రీసత్యసాయి సేవా సమాజంలో భగవాన్ శ్రీసత్య సాయీశ్వరునికి 11 ఆవృతులతో, నమక చమక రుద్రాభిషేకం వైభవంగా జరిగింది. శనివారం సాయంత్రం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకూ ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ అఖండ నామ సంకీర్తన జరిగింది. కార్యక్రమంలో శ్రీసత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు బులుసు వెంకటేశ్వర్లు, శ్రీసత్యసాయి గురుకులం కరస్పాండెంట్ అయోధ్యల శ్యాంసుందర్, జిల్లా పదాధికారులు, మందిరం అధ్యక్ష, కార్యదర్శులు, సమితి కన్వీనర్లు, సాయి భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక పోటీలకు ప్రాజెక్టు ఎంపిక


రాష్ట్రస్థాయికి ఎంపికైన ప్రాజెక్టుతో విద్యార్థి సూర్యనారాయణ, సైన్స్ ఉపాధ్యాయురాలు ఝాన్సీ

గోకవరం: మండలంలోని మల్లవరం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థి రూపొందించిన సైన్స్ ప్రాజెక్టు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల హెచ్‌ఎం ఎస్‌వీవీ సత్యనారాయణ శనివారం తెలిపారు. ఈ నెల 15, 16 తేదీల్లో రాజమహేంద్రవరం శ్రీసత్యసాయి గురుకుల పాఠశాలలో జిల్లా స్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శన జరిగింది. ఈ ప్రదర్శనలో మల్లవరం హైస్కూల్ విద్యార్థి ఆర్.సూర్యనారాయణ సైన్స్ ఉపాధ్యాయురాలు కె.ఝాన్సీ పర్యవేక్షణలో రూపొందించిన ఇకో ఫ్రెండ్లీ కాస్ట్ మంకీ స్కేరర్ డివైజ్ (ప్రాజెక్టు)రాష్ట్రస్థాయికి ఎంపికైంది. అలాగే ఈ ప్రదర్శనలో సైన్స్ ఉపాధ్యాయురాలు ఝాన్సీ సైతం జిల్లా ఉత్తమ సైన్స్ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. విద్యార్థితో పాటు సైన్స్ ఉపాధ్యాయురాలు ఝాన్సీని హెచ్‌ఎం, ఎంఈఓ బి.గౌరమ్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

అడబాలను సత్కరించిన జిత్‌మోహన్‌మిత్ర


మరిడియ్యకాపును సత్కరిస్తున్న సినీ నటుడు జిత్‌మోహన్‌మిత్ర

రంగంపేట: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా 160 సంవత్సరాల చరిత్ర ఉన్న రంగంపేట ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి మహోత్సవాల్లో భాగంగా దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో శనివారం పలువురిని సన్మానించారు. వివిధ పుస్తకాలు, పోటీ పరీక్షల మోడల్ పేపర్లు సేకరించి వాటిని విద్యార్థులకు అందించి విద్యను ప్రోత్సహిస్తున్న రంగంపేట మండలం దొడ్డిగుంట గ్రామానికి చెందిన అడబాల మరిడియ్యకాపును ప్రముఖ సినీనటుడు జిత్‌మోహన్‌మిత్ర చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు.


ఉమా కోటిలింగేశ్వరస్వామి రథానికి పూజలు చేస్తున్న ఎంపీ భరత్‌రామ్


రాజమహేంద్రవరంలో ఉమామార్కండేయస్వామి ఆలయం వద్ద విద్యుత్ కాంతులు


గోదావరి మాతకు నమస్కరిస్తున్న రుడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి

నాగాభరణా... సదా నీ స్మరణ

- ఆలయాల్లో భక్తుల రద్దీ
- భక్తిశ్రద్ధలతో శివరాత్రి పూజలు
- హోరెత్తిన సేవా కార్యక్రమాలు

సీటీఆర్‌ఐ: నాగాభరణాయా.. భజే రుద్రయా.. హరోంహర అంటూ ఆ మహా దేవునిని భక్తజనం కొలిచింది. సదా స్మరిస్తూ తరించింది.. శనివారం మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని రాజమహేంద్రవరం నగరం, రూరల్ నియోజకవర్గాల్లో శైవ క్షేత్రాలు భక్తులతో శోభిల్లాయి. ఉదయం నుంచే నగరంలోని గోదావరి తీరం శివనామ స్మరణతో మార్మోగింది. స్థానిక కోటిలింగాల క్షేత్రం, ఉమామార్కండేశ్వర స్వామి దేవాలయం, సారంగధరేశ్వరస్వామి ఆలయం, జాంపేటలో ఉమారామలింగేశ్వర స్వామి దేవాలయం, శంకరమఠం, శారద పీఠంలోని స్ఫటిక లింగేశ్వరస్వామికి విశేష పూజలు చేశారు. నగరంలోని పలు శివాలయాల్లో ఎంపీ మార్గాని భరత్‌రామ్ సతీ సమేతంగా పూజలు చేశారు. ఎంపీ తల్లిదండ్రులు మార్గాని నాగేశ్వరరావు, ప్రసూన, ఎంపీ భరత్, మోనా దంపతులకు ఆయా ఆలయాల అర్చకులు, కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. గోదావరి గట్టు ఉన్న మార్కండేశ్వర స్వామి ఆలయంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దంపతుల పేరున ఎంపీ ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయించారు. కాశీవిశ్వేశ్వర స్వామి, ఆల్కాట్ గార్డెన్స్‌లో కన్నమ్మ పేరంటాలు అమ్మవారిని ఎంపీ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలంతా సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ పరమేశ్వరుడిని కోరానన్నారు. జగనన్న మరో 30 ఏళ్లు సీఎంగా పాలన అందించాలని పూజలు చేశానన్నారు. అనంతరం ఐదు బళ్ల మార్కెట్, రైల్వే స్టేషన్ వద్ద అన్నదానాల్లో పాల్గొన్నారు. పుష్కరాల రేవులో పుణ్యస్నానం ఆచరించిన రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి గోదావరి మాతకు పూజలు చేశారు. బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో వై.జంక్షన్ వద్ద, ఏవీ అప్పారావు రోడ్డులో మంచు శివలింగాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ నృత్యరీతిపై నర్తన రుషి డాక్టర్ సప్పా దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో 40వ మహాశివరాత్రి నృత్యోత్సవం శైవాగమ వైభవాన్ని చాటేలా సాగింది. మార్కండేశ్వరుని సన్నిధిలోని నంది మండపంలో చిన్నారులచే ఆగమ శాస్త్రాను సారంగా నృత్యారాధన చేశారు.


మోరంపూడి జంక్షన్ వద్ద అన్న సమారాధనలో భక్తుల రద్దీ


ధవళేశ్వరంలో అగస్త్యేశ్వరస్వామి వారు


తుమ్మలావలో అన్నవితరణ చేస్తున్న శిష్టకరణ సంఘ సభ్యులు

మహా ప్రసాదం స్వామీ..

ప్రసాద వితరణ కార్యక్రమాలతో నగరం హోరెత్తింది. భక్తిని చాటుతూ దాతలు మజ్జిగ, పులిహోర, పుచ్చకాయలు, రస్నాలు, వెజ్ పలావు, కూల్‌డ్రింక్స్ వంటివి వితరణ చేశారు. మహాశివుని అనుగ్రహం ప్రజలందరికీ ఉండాలని కాంక్షిస్తూ శిష్టకరణ సేవాసమితి ఆధ్వర్యంలో తుమ్మలావ సెంటర్‌లో భక్తులకు ప్రసాద వితరణ చేశారు. సంఘ అధ్యక్షుడు ఎస్‌వీఎస్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. గోదావరి పరిరక్షణ సమితి అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో, మాత ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకుడు డాక్టర్ శింకా రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో పులిహోర పంపిణీ చేశారు. శ్రీపందిరి మహాదేవుడు కోటిలింగాల సత్రంలో సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి పళ్లంరాజు ఆధ్వర్యంలో అన్నవితరణ జరిగింది.

కడియం మండలంలో..

కడియం: కడియపులంకలో ఆంజనేయ స్వామివారిని గజమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయం వద్ద అన్నదానం జరిగింది. కడియం రాజ వీధిలోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయం వద్ద దాసరి వెంకట్రావు, వీర వెంకాయమ్మల జ్ఞాపకార్థం పులిహోర ప్రసాదాన్ని వారి కుటుంబ సభ్యులు పంపిణీ చేశారు. దుళ్లలో అగస్త్యేశ్వరాలయం వద్ద భక్తులు, దాతల సహకారంతో అన్నదానం జరిగింది. కడియంలో భ్రమరాంబికా మల్లేశ్వర స్వామివారికి, దుళ్లలో అగస్త్యేశ్వరస్వామివారికి రథోత్సవం నిర్వహించారు. కడియపులంకలో ఆంజనేయస్వామి ఆలయం, అపర్ణా సమేత అనంతేశ్వర స్వామివామి వారి ఆలయాలను వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు దర్శించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జేగురుపాడులో నగరేశ్వరునికి వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యాదల సతీష్ చంద్రస్టాలిన్ పట్టు వస్త్రాలను సమర్పించారు. కడియంలో భ్రమరాంబికా మల్లేశ్వరస్వామిని దక్షిణ మండల డీఎస్పీ శ్రీలత దర్శించుకున్నారు.

రాజమహేంద్రవరం రూరల్: మహాశివరాత్రిని పురస్కరించుకుని స్థానిక టి.నగర్‌లోని విశ్వేశ్వరస్వామివారి దేవస్థానంలో, ఉమామార్కండేయస్వామి ఆలయంలో వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. రైల్వే స్టేషన్ ఎదురుగా మమత రెస్టారెంట్ వద్ద చిడిపిరెడ్డి బ్రహ్మానందరెడ్డి బ్రదర్స్ అండ్ సన్స్ ఆధ్వర్యంలో అన్న సమారాధనను ఎంపీ మార్గాని భరత్‌రామ్ ప్రారంభించగా టీకే విశ్వేశ్వరరెడ్డి, కర్రి త్రినాథరెడ్డి, మిండి నాగేంద్ర పాల్గొన్నారు. మోరంపూడి జంక్షన్‌లోని సీవీ రావు గార్డెన్స్‌లో శ్రీసాయిభక్తాంజనేయ తాపేశ్వరం స్వీట్ స్టాల్ అధినేత వలవల చక్రపాణి, మోహిని దంపతుల ఆధ్వర్యంలో జరిగిన అన్నసమారాధనలో 20 వేల మంది పాల్గొన్నారు. రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, ప్రముఖ శిల్పి వడయార్ హాజరయ్యారు. ముందుగా చక్రపాణి, ప్రతాప్, ప్రదీప్‌లు గణపతి, రుద్ర, చండీ యాగాలు, శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. వెంకటనగరంలో కాశీఅన్నపూర్ణ విశ్వేశ్వరస్వామి ఆలయంలో ధర్మకర్త ఉప్పులూరి వీరవెంకట సత్యనారాయణ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూజలు చేశారు.

ధవళేశ్వరం: స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిగాయి. వైఎస్సార్ సీపీ నాయకులు డాక్టర్ తోరాటి ప్రభాకరరావు, పందిళ్ల భానుప్రసాద్, దేవస్థానం అధికారులు, భక్త బృందం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. జనార్దనస్వామి కొండ వెనుక వైపు ఉన్న విద్యాధరేశ్వరస్వామి వారికి, రామపాదాల క్షేత్రంలో ఉమారామలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు జరిగాయి.


దుళ్ల రథోత్సవంలో డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు


దుళ్లలో అగస్త్యేశ్వరుడిని దర్శించుకుంటున్న వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ నాగేశ్వర్


రైల్వేస్టేషన్ వద్ద అన్నసమారాధనను ప్రారంభిస్తున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్


ఈశ్వరీ బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ఏర్పాటైన మంచు శివలింగం


పులిహోర పంపిణీ చేస్తున్న రాజేంద్రప్రసాద్ తదితరులు

రుణాలను సద్వినియోగం చేసుకోండి


రుణాలకు సంబంధించి చెక్కులను పంపిణీ చేస్తున్న క్రిషన్‌శర్మ

ధవళేశ్వరం: రుణాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని ఎస్‌బీఐ అమరావతి ప్రధాన కార్యాలయం ముఖ్య కార్యనిర్వహణాధికారి క్రిషన్ శర్మ, ఎస్‌బీఐ రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయ అధికారి జంగారెడ్డి పేర్కొన్నారు. శనివారం రాత్రి ధవళేశ్వరంలోని స్వర్ణమోహన్ కల్యాణ మండపంలో స్థానిక ఎస్‌బీఐ శాఖ ఆధ్వర్యంలో సంధ్యా శిబిరం కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ఎస్‌బీఐ ప్రాంతీయ కార్యాలయాధికారి జంగారెడ్డి టి.రావు, శాఖాధికారి ఎం.శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన క్రిషన్‌శర్మ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాంతీయ కార్యాలయం పరిధిలోని అన్ని శాఖల ద్వారా ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు రూ.12 కోట్ల రుణాలు అందించినట్లు వెల్లడించారు. ఈ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయదారులు, చిరు వ్యాపారులు, నిరుద్యోగ యువతకు బ్యాంకు అందించే రుణ పథకాలు, ప్రభుత్వ పథకాల గురించి ఆయన వివరించారు.

వైద్యులు నిర్లక్ష్యం చేశారంటూ ఆందోళన

రాజమహేంద్రవరం సిటీ: ఆసుపత్రిలో సరైన వైద్యం అందకపోవడంతోనే తన కుమారుడు మట్టా సందీప్ శుక్రవారం మరణించాడని మృతుని తండ్రి మట్టా శ్యామ్‌సుందర్ ఆరోపించారు. ఈ మేరకు శనివారం స్థానిక దానవాయిపేటలోని రాజు న్యూరో ప్రైవేట్ వైద్యశాల వద్ద బంధువులతో కలసి ఆందోళన చేశారు. ఎండోస్కోప్ పరీక్షలు జరిగిన మూడు నిమిషాలకు కార్డియాక్ అరెస్ట్‌తో చనిపోయాడంటూ వైద్యులు ప్రకటించడం సరికాదని ఆయన అన్నారు. మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి పేరుతో కనీస వైద్య పరికరాలు లేకుండా వైద్యం చేస్తున్నారని, దీనివల్లే తన కుమారుడు మృత్యువాత పడ్డాడని చెప్పారు. మృతుడు రాజమహేంద్రవరం రూరల్ ఎంపీడీఓ రత్నకుమారి కుమారుడు. బంధువులు, స్నేహితులు ఆసుపత్రి వైద్యులను నిజం చెప్పాలంటూ నిలదీశారు. ఘటనా స్థలానికి పోలీసులు చేసుకుని మృతుని బంధువులు, ఆసుపత్రి యాజమాన్యంతో చర్చలు జరిపారు. చర్చలు ఫలించకపోవడంతో న్యాయపరమైన పోరాటం చేసేందుకు సిద్ధమవుతున్నట్లు శ్యామ్‌సుందర్ తెలిపారు. ఈ విషయమై ఆసుపత్రి వైద్యుడు రఘువీర్ మాట్లాడుతూ అప్పటికే వ్యాధి ముదిరి ముగ్గురు వైద్యుల వద్దకు వెళ్లి అక్కడ నయం కాకపోవడంతో చివరిగా తమ వద్దకు వచ్చారన్నారు. చాలా సమస్యలతో వైద్యానికి రావడంతో ఎండోస్కోపి చేశామని అన్నారు. అదే సమయంలో కార్డియాక్ అరెస్ట్ కావడంతో మృతి చెందాడని తెలిపారు.

మహా శివలింగానికి ప్రత్యేక పూజలు


మహా శివలింగానికి పూజలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా స్థానిక పుష్కర ఘాట్ సమీపంలో మహా శివలింగానికి పండితులు విశేష పూజలు చేశారు. మహా పుష్పహారాన్ని క్రేన్ సహాయంతో వేశారు. వైఎస్సార్ సీపీ నేత రామ్‌సాయిదీప్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్‌రామ్ ముఖ్య అతిథిగా హాజరై పూజలు చేశారు. అనంతరం నక్షత్ర హారతి ఇచ్చారు. నగర పార్టీ అధ్యక్షుడు అడపా శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్‌తో పంటకు చేప బెల్లం ద్రావణం పిచికారీ


పిట్టల వేమవరంలో డ్రోన్ సహాయంతో ద్రావకాన్ని పిచికారీ చేస్తున్న సిబ్బంది

పెరవలి: ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తే తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ విభాగం మాస్టర్ ట్రైనర్ మహేష్ సూచించారు. మండలంలోని పిట్టల వేమవరం గ్రామంలో శనివారం 50 ఎకరాల విస్తీర్ణంలోని వరి పైరుకు డ్రోన్ సహాయంతో చేప బెల్లం ద్రావణాన్ని పిచికారీ చేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ ప్రతి రైతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించినపుడే భూమికి మేలు జరుగుతుందన్నారు. గతంలో పెరవలి మండలంలో 1000 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తే ఇప్పుడది మూడు వేల ఎకరాలకు విస్తరించడం అభిలషణీయమన్నారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులు ఇలా సామూహికంగా సహజ సిద్ధమైన కీటన నాశనులను పిచికారీ చేయడం వలన ఖర్చు తగ్గటమే కాకుండా తెగుళ్ల బెడద ఉండదన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది బుజ్జి, వెంకట్రావు, విద్యాలత, రత్నరాజు, మహేష్, ప్రసాద్, రవి, శేఖర్, రైతులు పాల్గొన్నారు.

క్షతగాత్రునికి అండగా ఎమ్మెల్యే తలారి

దేవరపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తికి గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు సకాలంలో మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకున్నారు. మండలంలోని యర్నగూడెం వద్ద జాతీయ రహదారిపై శనివారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. బైక్‌పై వెళుతున్న దంపతులు ప్రమాదవశాత్తూ బైక్ అదుపు తప్పడంతో కింద పడిపోయారు. దాంతో భర్తకు తీవ్ర గాయాలై, జాతీయ రహదారి డివైడర్‌పై పడి ఉన్నాడు. సాయం కోసం అతడి భార్య ఎదురు చూస్తోంది. ఆ సమయంలో అటుగా వెళుతున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు స్పందించారు. 108 వాహనాన్ని పిలిపించి వెంటనే వారిని సమీప ఆసుపత్రికి తరలించేలా చర్యలు తీసుకున్నారు. వారికి మెరుగైన చికిత్స అందించాలని అధికారులకు ఆదేశించారు. కాగా ప్రమాదంలో గాయపడిన దంపతుల వివరాలు తెలియాల్సి ఉంది.


యర్నగూడెం వద్ద రోడ్డు ప్రమాద బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

యువకుడి అదృశ్యంపై కేసు

నిడదవోలు రూరల్: యువకుడి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు సమిశ్రగూడెం ఎస్సై షేక్ సుభానీ శనివారం తెలిపారు. కాటకోటేశ్వరం గ్రామానికి చెందిన బండారు రాంబాబు (24) ఈనెల 16న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని తల్లి సూర్యకుమారి ఫిర్యాదు ఇచ్చింది.

గోదావరిలో వ్యక్తి మృతదేహం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక పుష్కర ఘాట్ సమీపంలో రిలయన్స్ మార్ట్ వెనుక గోదావరి గట్టు వద్ద శనివారం గుర్తు తెలియని మృతదేహం కొట్టుకువచ్చింది. ఈ విషయం తెలుసుకున్న త్రీటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతునికి సంబంధించి ఆధారాలు లభించలేదు. వయస్సు 30 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండవచ్చని, నల్ల చొక్కా, బ్లూజీన్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడని చెప్పారు.

శరీరంపై సూదులు, శూలాలతో భక్తులు

- బ్రాహ్మణగూడెం బాలరామలింగేశ్వరస్వామి గ్రామోత్సవంలో నందడి


బ్రాహ్మణగూడెంలో శివరాత్రి ఉత్సవాల్లో పెద్ద శూలం ధరించిన యువకులు

చాగల్లు: మహాశివరాత్రి నాడు మండలంలోని బ్రాహ్మణగూడెంలో భక్తులు వింత ఆచారం పాటిస్తారు. శరీరం అంతా సూదులు, శూలాలు గుచ్చుకుని శివునికి మొక్కుకుంటే కోరిన కోర్కెలు నెరవేరతాయని ఇక్కడి భక్తుల నమ్మకం. శివరాత్రి సందర్భంగా శనివారం బ్రాహ్మణగూడెం బాలరామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 300 మంది భక్తులు సూదులు, శూలాలు శరీరానికి గుచ్చుకుని గ్రామోత్సవంలో పాల్గొన్నారు. భక్తులు ఒళ్లంతా శూలాలు ధరించుకొని తమ భక్తి భావాన్ని చాటుకుంటారు. శరీరంపై సూదులు గుచ్చుకోవడం చూసేవారికి ఒళ్లు గగుర్పొడిచినా భక్తులు మాత్రం తన్మయత్వంతో ఉంటారంటున్నారు.పిల్లలు, పెద్దలు, యువకులు అందరూ ఈ శూలాలు ధరించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. ఒక్కో భక్తుడు అత్యధికంగా వెయ్యికు పైగా శూలాలు ధరించి ఊరేగింపులో పాల్గొన్నారు. ఆలయంలో శూలాలు ధరించేటపుడు ఆలయ ప్రాంగణం అంతా శివనామ స్మరణంతో మారుమోగింది.

నడిచి వచ్చేము.. నిను చూసేము


వంగలపూడి రేవు నుంచి ట్రాక్టర్‌పై పట్టిసీమకు వెళ్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: వీరభద్రస్వామిని కొలిచేందుకు భక్తజనం కదిలివచ్చింది.. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏలూరు జిల్లా పోలవరం మండలం పట్టిసీమ వద్ద గోదావరి మధ్యలో ఉన్న భద్రకాళీ సమేత వీరభద్రుని దర్శనానికి వంగలపూడి, రామచంద్రపురం రేవుల నుంచి శనివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివెళ్లారు. వంగలపూడి రేవు నుంచి గోదావరి పాయపై వేసిన నడక మార్గం ద్వారా, రామచంద్రపురం రేవు నుంచి నేరుగా ట్రాక్టర్లపై భక్తులు పట్టిసీమకు వెళ్లారు. వంగలపూడి గోదావరి పాయపై నడక మార్గం నుంచి రాత్రి పది గంటల వరకూ 70 వేల మంది భక్తులు వెళ్లినట్లు అంచనా. రామచంద్రపురం రేవు నుంచి ట్రాక్టర్ల ద్వారా రాత్రి పది గంటల వరకూ 25 వేల మంది వెళ్లారని అధికారులు చెబుతున్నారు. ఈ ఏర్పాట్లను తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ రాజు, ఎంపీడీఓ కె.రమేష్, నార్త్‌జోన్ డీఎస్పీ కడలి వెంకటేశ్వరరావు, ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ రేఖపల్లి సుజాత, పంచాయతీ కార్యదర్శి నాగసతీష్, సర్పంచ్ కొంచ అన్నపూర్ణ తదితరులు పర్యవేక్షించారు. ఆయా రేవులలో ఉచిత భోజన ఏర్పాట్లు చేశారు. డాక్టర్ ఎస్.రాజు ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. కాటవరం, మునికూడలి, ముగ్గళ్ల, సీతానగరంలో శివాలయాల్లో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా స్వామివార్లను దర్శించుకుని సీఎం జగన్ దంపతుల పేరున ప్రత్యేక పూజలు చేశారు.